Reg. No. 757

# అభినవసరస్వతి

[ మాసపత్రిక ]

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రిచే

ప్రచురింపఁబడుచున్నది.

గుంటూరు.


| | | |
|---|---|---|
| సంపుటము 32 | 1940 సం॥ అక్టోబరు నెల 15 వ తేది | సంచిక 7 |


## విషయములు.



చందానిర్ణయము సంవత్సరమునకు

| | | | |
|---|---|---|---|
| ప్రధానపోషకులకు | రు 25 0 0 | సహాయులకు | రు 5 0 0 |
| ఇ – | 10 0 0 | చందాదారులకు | రు 3 0 0 |

Printed at the Chandrika Press, Guntur,
and published at Guntur by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

# రాజపోషకులు.

శ్రీమంతు, రాణి ఆదిలక్ష్మీదేవమ్మ బహాదరుగారు,
గద్వాలసంస్థానము.

## ప్రధానపోషకులు.

౧ శ్రీశ్రీ జగద్గురు సచ్చిదానందాభినవశంకరభారతీస్వాములవారు, హంపి.

౨ శ్రీశ్రీ జగద్గురు, అభినవోద్దండ విద్యాశంకరభారతీ స్వాములవారు, పుష్పగిరి.

౩ తంగెడ నరసింహారావుగారు, కరణము, మొర్జంపాడు.

౪ ఆర్. రామారెడ్డిగారు, దైవముదిన్నె.

౫ రాజా సురభి వెంకటరత్నాంబ బహాదరుగారు, రాణి, ఆఫ్ జటప్రోలు, కొల్లాపురము

౬ శ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామివారు, యాదగిరి.

౭ రాజా రఘునందనసింగుగారు, నెల్లుట్ల.

౮ లింగాల రంగారెడ్డి దేశముఖుగారు, గణపురము.

## పోషకులు.

౧ జాగర్లమూడి కుప్పుస్వామినాయుడుగారు, కారంచేడు.

౨ రాజా కందుకూరు బాలసూర్యప్రసాదరావు బహాదరు జమీందారుగారు - దేవిడీ

౩ కాండ్రి వెంకటకృష్ణారెడ్డి దేశముఖుగారు, బసవాపురము.

౪ రామచంద్రారెడ్డి దేశముఖుగారు, ఇసునూరు.

# అభినవసరస్వతి

| సంపుటము | వికృతి నామసంవత్సరము | సంచిక |
| --- | --- | --- |
| ౩౨ | ఆశ్వయుజమాసము | ౭ |


## కృతివిమర్శము

**జాతకకథాగుచ్ఛము.**

ఇది యాంధ్రకావ్యమాల కాదిపుష్పము. గ్రంథకర్త శిరోమణి సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు. అనేకపర్యాయము లప్పటప్పట జాతుఁడైన బోధిసత్త్వుని కథల గుచ్ఛమగుట జాతశబ్దము పైఁ గప్రత్యయముఁ జేర్చి దీనికి జాతకకథాగుచ్ఛమని పేరిడినట్లు గోచరించెడిని. ఏభాషలోని కథలకో యిది యనువాదమనియు నందలి పేరే యిందుఁ జేర్చెననియుఁ దోఁచెడిని. బహుపర్యాయజాతుఁడైన బోధిసత్త్వుఁ డొకపర్యాయము క్షాంతివాది పేర జగద్విఖ్యాతుఁడైనట్లు

క. శాంతియు దాంతియు క్షాంతియు
కొంతైనను దొలఁకనీయఁగూడ దుడుకు య
శాంతము విశ్రాంతిని మన
స్వాంతంబున కొసఁగి మోక్షసాధకము లగున్.

ఆ. అనుచు క్షాంతిఁబూని యదె ధర్మసారమం
చన్యులకును గఱపు, ఆచరించు
క్షాంతివాది యంచు సార్థకనామంబు
దాల్చియుండె నతఁడు దానఁజేసి

అను నిందలిపద్యములవలనఁ దెలియనయ్యెడిని. ఇట్లు క్షాంతివాది వ్యాఘ్రశిబి విశ్వాంతర శుద్ధోధుల యైదుగురి జాతకములతో నీగ్రంథ మన్వితము. ఇందు

చ. క్షితి జనియించినట్టి ప్రతిజీవియు శాంతిపథం బెఱింగి సం
చితమగు పాపబృందము నశింపఁగ దుర్గతి దూలద్రుచ్చి స
ద్గతిఁ బడయంగఁ దృష్ణను బెకల్చి సమూలముగా మదిన్ దృఢ
వ్రతత జితేంద్రియుండయి ప్రవర్తిలఁగావలె జీవితాంతమున్.

ఉ. కాంచినదెల్లఁ గావలయుఁ గావలెనంచు నిరంతరంబు వే
ధించుచునుండఁ జిత్తము పదింబదిగా నరుఁ డెల్లవాని సా
ధించఁగ రేబవల్ తినఁగఁ దీఱిక కంటికిఁ గూర్కురాక దుః
ఖించుచునుండ నాతని సుఖిత్వ మదెంతసుఖిత్వ మిస్సిరో !

క. తనదొడ్డి వేల్పుగిడ్డియు
తన ముంగిట వేల్పుఁజెట్టుఁ దనగృహమునఁ గాం
చనశైలముఁ జింతామణి
యును వెలిసిన నరుని కామ ముడుగదు లవమున్.

క. కామోపభోగతతిచేఁ గామము శాంతిల్లదండ్రు కణమైన హవి
స్తోమమున నగ్ని యుంబలె, నేమమునఁ ద్యజింపనదియు నిక్కంబడఁగున్.

ఉ. ఈహాలు సాగరోర్ములన నెత్తటి లేవు ? సమూల మెట్టు లీ
ఐహికదుఃఖనాశమగు ? ఇంద్రియవృత్తుల నిగ్రహించి శ్రీ
మోహము దాఁటి శాంతమతిఁ బూని విరాగము వాసనాతతిన్
దేహవిముక్తిఁ బొందుటకు దేహి ప్రయత్న మొనర్పఁగావలెన్.

ఈ మొదలైనధర్మము లెన్నియో బోధింపఁబడినవి. కవిత్వము ముద్దులు మూటఁగట్టుచు నేరసము నెత్తికొన్నను నారసము ప్రవాహమై పాఱినది. లోకోక్తులతో ననేకపద్యము లతిహృద్యములై యలరారెడిని. మచ్చునకు మఱికొన్ని ప్రదర్శ్యమానములు.

క. చెంపకుఁ జేరెఁడుకన్నులుఁ గెంపుల వెదఁజల్లు మోవి గిరిక్రేపులనన్
సొంపారు పయోధరములు శంపాలతఁబోని మే నెసంగును సతికిన్.

క. చిదిపియు దీపమువెట్టం
గఁదగ్గ పెనుసొగసు వయసు గలిగిన యాచి
న్నది పరిఢవిల్లుచున్నది
మదనుండు సవారిగొను హయమాయి యనంగన్.

క. త్రైలోక్య మెన్నితడవలు గాలించిన దానిఁబోని కామిని గనరా
దేలా తినఁబోవుచు భూపాలక! రుచియడుగవలయు? పదచూపింతున్.

శా. వ్యాకీర్ణంబగు కేశపాశము నితంబాభోగముం గప్ప న
స్తోకశ్రీ వెదఁజల్లఁగా వదనచంద్రుం డంగలావణ్య మా
హా కల్గింపఁగ దాగురింతలకు లోనై కావిపుట్టంబునం
దాకాంతామణి కోయుచుండె నటఁ బూజార్థంబు పుష్పంబులన్.

కీరసందేశము — ఇది 2 వ పుష్పము. కర్త సూర్యనారాయణశాస్త్రిగారే. ఇది రుక్మిణి శ్రీకృష్ణునకు బ్రాహ్మణుని ద్వారమునఁ గాక కీరము ద్వారమున సందేశ మంపినట్లు చెప్పును. సంస్కృతాంధ్రాంగ్లేయభాషాకోవిదులును వ్యాకరణవిదులును నైన సూర్యనారాయణశాస్త్రిగారి కవిత్వము నిర్దుష్టము, ప్రౌఢము, హృదయంగమము.

## ఋతుమతీవివాహఖండనము

లోకుల ధర్మాధర్మములుఁ గృత్యాకృత్యములు వేదమం దుండును. వానిని విస్తారముగాఁ దెలియఁజేయుటకై యుపకారార్థము ప్రవర్తించిన మన్వాదులకును దత్ప్రమాణము ననుసరించిన యాపస్తంబాది సూత్రకారులకును ననృతుమతీవివాహమందే యభిప్రాయము కాని ఋతుమతీవివాహమందు లేదు.

శ్లో. ఉత్కృష్టా యానురూపాయ వరాయ సదృశాయచ
అప్రాప్తామపి తాం తస్మై కన్యాం దద్యా ద్విచక్షణః

కన్యకకు వివాహముఖ్యకాలము సంప్రాప్తము కాకయుండినను గుణవంతుఁడైన వరుఁ డెప్పుడు దొరకిన నప్పుడే వివాహముఁ జేయవలయునని మనువు నభిప్రాయము. స్త్రీలకు ముఖ్యకాలమైన గర్భాష్టమమందే వివాహముఁ జేయవలయునని ముఖ్యాభిప్రాయము.

శ్లో. దద్యా ద్గుణవతే కన్యాం నగ్నికాం బ్రహ్మచారిణే
అపివా గుణహీనాయ నోపరుంధ్యా ద్రజస్వలాం.

ఉపనీతుఁడై గురుకులవాసముఁ జేయుచు ద్వాదశవర్షకాల మస్ఖలిత బ్రహ్మచర్యాశ్రమ మనుష్ఠించి గురువుయొక్క యాజ్ఞ పొంది స్నాతకుఁడై గుణవంతుఁడైన బ్రహ్మచారి కనృతుమతియగు కన్యక నిచ్చి వివాహము జరిపించవలయును. ఇట్టిగుణములుగల బ్రహ్మచారి సంభవించినపుడు వాని కీయక గుణహీనున కీయఁగూడదని బోధాయనుల తాత్పర్యము.

శ్లో. ప్రాప్తేతు ద్వాదశే వర్షే యః కన్యాం న ప్రయచ్ఛతి
మాసిమాసి రజ స్తస్యాః పితా పిబతి శోణితం.
తస్మా ద్వివాహయే త్కన్యాం యావ న్నర్తుమతీ భవేత్.

స్త్రీలకుఁ బదిరెండుసంవత్సరములకుఁ బైన ఋతుకాలము నిర్ణయించియుండుటవల్ల నట్టి ఋతువు సంప్రాప్తము కాకమునుపే వివాహము జరపవలయును. అట్లు జరపక కాలయాపనమువల్ల రజస్వలఁ గావించిన నారజస్సును బితృదేవతలు పానముఁ జేయవలసివచ్చును. కావున ఋతుదోషము సంభవింపకమునుపే కన్యకకు వివాహముఁ జేయవలయునని యిదిగాక

శ్లో. పాదౌ శుచి బ్రాహ్మణానా మజాశ్వస్య ముఖం శుచిః
గవాం పృష్ఠాని మేధ్యాని సర్వగాత్రాణి యోషితాం.

దేహమందు రోమములు మొలవకమునుపే చంద్రుఁడును కుచము లావిర్భవింపకమునుపే యగ్నిహోత్రుఁడును రజఃకోశమందు రజస్సు ప్రవేశింపకమునుపే గంధర్వుఁడును నాశ్రయించుటవల్ల స్త్రీల దేహము మహాపరిశుద్ధమని బృహస్పతిచేఁ జెప్పఁబడియున్నది. కావున నిట్టులఁ బరిశుద్ధమైన కన్యకకు ఋతుదోషము సంప్రాప్తము కాకమునుపే వివాహముఁ జేసి యీయవలయుననియు సంవర్తుని యభిప్రాయము.

శ్లో. కన్యా ద్వాదశకే వర్షే యా త్వదత్తా గృహే వసేత్
భ్రూణహత్యా పితు స్తస్యాః, స్సా కన్యా వరయే త్స్వయం.

ఏకన్యక పదిరెండవసంవత్సరము సంప్రాప్తమయినపిదపఁగూడ వరునకు దత్తగాక పితృగృహమందు వసించుచున్నదో యాకన్యకపితకు భ్రూణహత్యాపాపము విధింపఁబడి యున్నది కావున నాపిత కాపాపము సంభవించకుండుటకొఱకుఁ గన్యక స్వయముగా నైనఁ బతిని వరింపవలయునని యముని యభిప్రాయము.

శ్లో. యావంతశ్చర్తవ స్తస్యా స్సమతీయుః పతింవినా
తావంతో భ్రూణహత్యాస్స్య స్తస్య యో నదదాతి తాం.

దానముచేయక మందబుద్ధితోఁ గాలహరణముచేయు కాలమందుఁ గన్యకకు రజోదోషము సంప్రాప్తమయ్యెనేని యాపిత కెన్నిమార్లు యార్తవమున కెన్నిమార్లు భ్రూణహత్యాపాపము విధింపఁబడియున్నది కావున రజోదోషసంప్రాప్తికి మునుపే దానముచేయవలయునని నారదుల యభిప్రాయము.

శ్లో. ప్రయచ్ఛే న్నగ్నికాం కన్యాం ఋతుకాలభయాన్వితాం
ఋతుమత్యాంహి తిష్ఠంత్యాం దోషః పితర మృచ్ఛతి.

స్త్రీలు ఋతుదోషము సంప్రాప్తము కాఁబోవుచున్నదనెడి భీతితోఁ గూడుకొని యుండువారు కావున నది సంప్రాప్తము కాకమునుపే కన్యకను దానముచేయవలయుననియు నటులఁ జేయకపోయెనేని యాదోషము పితను బాధించుననియు గౌతముల యభిప్రాయము.

శ్లో. తస్మాత్తు బ్రాహ్మణో భీతో జనవాదా త్కులోద్భవః
దశవర్షాత్పరం కన్యాం కృచ్ఛ్రేపి నవివాహయేత్.
దశవర్షాత్పరం నారీ కీర్తితా సా రజస్వలా.
సందిగ్ధాం వర్జయేచ్చైవ నిస్సందిగ్ధాం వివాహయేత్.

పదిసంవత్సరములకుఁ బైన రజస్వలయని సాంకేతికము నిర్దేశించియుండుటవల్ల నది మొదలు రజోదోషము సంభవించినను సంభవించకయుండినను భీతులై లోపలనే సందిగ్ధగాక నిస్సందిగ్ధగనుండు కన్యకనే వివాహము చేసికొనవలయునని లోకాక్షి యభిప్రాయము. ఇత్యాది వచనములవల్ల మనువు మొదలగు స్మృతికర్త లందఱికిని ఋతుమతీవివాహము చేయఁగూడదని తాత్పర్యమని స్పష్టముగాఁ దెలియుచున్నది. పురుషులకు గర్భాష్టమ మెటుల ముఖ్యమో స్త్రీల వివాహమునకు నష్టమసంవత్సరము ముఖ్యకాలము. ఆపస్తంబసూత్రము॥ గర్భాష్టమేషు బ్రాహ్మణ ముపనయీత.

శ్లో. గర్భాష్టమేబ్దే కుర్వీత బ్రాహ్మణస్యోపనాయనం.
గర్భా దేకాదశే రాజ్ఞః, గర్భాత్తు ద్వాదశే విశః
బ్రహ్మవర్చసకామస్య కార్యం విప్రస్య పంచమే.

రాజ్ఞో బలార్థిన ష్షష్ఠే, వైశ్యస్యేహార్థినోఽష్టమే.
ఆషోడశా ద్బ్రాహ్మణస్య సావిత్రీ నాతివర్తతే.
ఆద్వావింశా త్క్షత్రబంధోః, ఆచతుర్వింశతే ర్విశః (మనుః).

ఇటులఁ బురుషుల కుపనయనమునకు ముఖ్యకాలము గర్భాష్టమము గాని శుద్ధాష్టమము గాని విధింపఁబడియున్నది. అదిమొదలు ద్వాదశే పటుకామయని చెప్పియుండు ప్రకారము పదిరెండుసంవత్సరములవఱకుఁ బురుషుల కుపనయనమునకు ముఖ్యకాలప్రాయమే. ఆపైనఁ బదియాఱుసంవత్సరములవఱ కుపనయనమునకు గౌణకాలము. పదిరెండు సంవత్సరములకుఁ బై నాపత్కాలవిషయమం దొక్కవే కాని స్వస్థులుగా నుండుకాలమందు శాస్త్ర మొప్పదు పదియాఱుసంవత్సరములకుఁ బైపక్షమందు సావిత్రీపతితుఁడనియు వృషలుఁడనియుఁ గడు నిందించియున్నది.

శ్లో. అగ్రజా బాహుజా వైశ్యా స్స్వవధే రూర్ధ్వ మబ్దతః
అకృతోపనయా స్సర్వే వృషలా ఏవ తే స్మృతాః. (నిర్ణయసింధుః).

ఇటులనే స్త్రీల కుపనయస్థానమందు వివాహసంస్కారము శాస్త్రమందు విధింపఁబడియున్నది.

శ్లో. ఉపానయోచితః కాల స్స్త్రీణా ముద్వాహకర్మణి
స్త్రీణా ముపనయస్థానే వివాహో మను రబ్రవీత్. (స్మృతిరత్నావళి)

కన్యాత్వమెంతకాలమువఱకు ననువర్తించుచున్నదో యంతవఱకు ముఖ్యకాలము. కన్యాత్వము పదిసంవత్సరములవఱకు శాస్త్రములందు విధింపఁబడియున్నది. కన్యయని వయోవస్థానిమిత్తమువల్ల సంభవించిన నామము. ఆశబ్దముచేత లజ్జాద్యభిజ్ఞానరహిత వయోవస్థ వివక్షితము.

శ్లో. యావ న్న లజ్జితా కన్యా యావత్క్రీడతి పాంసుభిః
యావ త్తిష్ఠతి కౌమారే తావ త్కన్యాం వివాహయేత్
యావ న్న లజ్జితాంగాని కన్యా పురుషసన్నిధౌ
యోన్యాదీ న్యవగూహేత తావద్వర్తతి నగ్నికా.
యావ చ్చేలం నగృహ్ణాతి యావత్క్రీడతి పాంసుభిః
యావద్దోషం నజానాతి తావద్భవతి నగ్నికా. (స్మృతిసముచ్చయః)

శ్లో. నగ్నికా ఽనాగతార్తవా యావ దృతుదర్శనం తావ త్కన్యకా.
(అమరకోశః)

ఇటులఁ గన్యావస్థకే నగ్నికయనియు నామాంతరము. స్త్రీలకుఁ గన్యాశబ్ద మెనిమిది తొమ్మిది పదిసంవత్సరములవఱకే విధింపఁబడియున్నది.

శ్లో. అష్టవర్షా భవే త్కన్యా, నవవర్షాతు రోహిణీ,
దశవర్షా భవే ద్గౌరీ, అతఊర్ధ్వం రజస్వలా.
(యమ గౌతమ పరాశరాః)

శ్లో. అష్టవర్షా భవే ద్గౌరీ, నవమే కన్యకా భవేత్
ప్రాప్తేతు ద్వాదశే వర్షే రజ స్త్రీణాం ప్రవర్తతే (ఆపస్తంబః)
అష్టవర్షా భవే ద్గౌరీ, నవవర్షాతు రోహిణీ.
దశవర్షా భవే త్కన్యా, అతఊర్ధ్వం రజస్వలా (సంవర్తః)

ఇత్యాది వచనములవల్ల నెనిమిది తొమ్మిది పది సంవత్సరములఁ గన్యకాత్వము. కావున స్త్రీల కీమూఁడుసంవత్సరములు వివాహమునకు ముఖ్యకాలమని నిర్ణయము. ఇటులనే పదునొకండవసంవత్సరమునఁ గన్యాదినామములవలె రజస్వలయని సాంకేతిక నామమే. ప్రత్యక్షముగా ఋతుమతియైన స్త్రీకి ఋతుమతీపుష్పవత్యాదినామములు.

శ్లో. కులశీలవయోవృత్తాం రూపాఢ్యాం నగ్నికాం శుభాం
అపరావాయనాత్కన్యా ముద్వహే దాత్మనస్సమాం.
షష్ఠాబ్దా త్కన్యకా నారీ శైశవే స్యా చ్ఛుభావహా.
తా మష్టాదశవర్షీయో విధినై వోద్వహే త్సుమాన్.
యాష్టవర్షా భవే ద్గౌరీ పుత్రపౌత్రవివర్ధినీ
తథా వింశతివర్షీయ స్తాం కన్యాం ముద్వహే ద్బుధః.
రోహిణీ నవవర్షా యా ధనధాన్యవివర్ధినీ
ఊనత్రింశతివర్షీయ స్తా ముద్వాహ్య ధనీ భవేత్.
కన్యా యా దశవర్షీయా సర్వసంపత్కరీ శుభా
తా ముద్వహే ద్యది పుమాన్ సర్వకామసమృద్ధయే.
ఊర్ధ్వం దశాబ్దా ద్యాకన్యా ప్రాగ్రజోదర్శనాత్తు సా
గాంధారీస్యా త్సముద్వాహ్య చిరంజీవితుమిచ్ఛుభిః (ఆశ్వలాయనః)

పదునొకొండవసంవత్సరము మొదలు ఋతుదోషము సంప్రాప్తించువఱకు గాంధారియనియు సాంకేతిక నామము. ఎనిమిది తొమ్మిది పదిసంవత్సరములు ముఖ్య కాలమనియుఁ బదునొకండు పదిరెండు సంవత్సరములు గౌణపక్షమనియు నంతకుఁ బైనఁ బ్రత్యక్షముగా రజోదోషము సంభవించుటకు లోపల వివాహముఁజేయుట యాపత్కాలపక్షమనియు శాస్త్రనిర్ణయ మయియున్నది. ముఖ్యకాలమందు యథోక్తముగా సాలంకృతకన్యాదానముఁజేసిన దాతలకు విధింపఁబడిన సద్గతి చెప్పఁబడుచున్నది.

శ్లో. గౌరీం దద న్నాకపృష్ఠం వైకుంఠం రోహిణీం దదత్.
కన్యాం దద ద్బ్రహ్మలోకం రౌరవంతు రజస్వలాం. (బృహస్పతిః)

మఱియుఁ గన్యాదానఫలము చెప్పఁబడియెడిని.

శ్లో. వస్త్రాదివాంఛాం సంత్యక్త్వా శక్త్యాలంకృత్య స్వాం సుతాం
కులజాయ సుశీలాయ స్నాతకవ్రతచారిణే
ఆరోగాయ శ్రుతవతే యో దద్యాత్తం శ్రుణుష్వ మే.
పితరో ముక్తిమాయాంతి. స్వయంచ బ్రహ్మణఃపదం.
(కూర్మపురాణే)

వైపరీత్యకన్యాదానవిషయము.

శ్లో. క్రయక్రీతాతు యా నారీ న సా పత్న్యభిధీయతే.
న సా దైవేచ పిత్ర్యేచ దాసీం తాం కశ్యపోబ్రవీత్.

శుల్కము గ్రహించి కన్యాదానముఁజేసిన ముఖ్యకాలములోఁ జేసినను రౌరవాదినరకము తప్పదని తాత్పర్యము.

శ్లో. యదీచ్ఛే ద్ద్వాహ్మజం ధర్మం వహ్నే రేకగుణాం సతీం
స్వయంచ త్రిగుణో బ్రహ్మ వివాహంతు సమాచరేత్.
(విష్ణుధర్మోత్తరే)

వధూవరుల వివాహమందుఁ గన్యక వయస్సుకు మూడుభాగము లధికము వరునకు వయస్సుండవలయునవియు నంతకు హెచ్చుతక్కువ యధర్మమనియు శాస్త్రనిర్ణయము. అష్టవర్షకన్యకకుఁ ద్రిగుణవయస్సు వరుని కుండవలయుననియే శాస్త్రము ఇరువదియైదుకుఁ బైన నేఁబదిసంవత్సరములకు లోపలఁ బురుషుఁడు వివాహముఁ జేసికొనవలయుననియు నేఁబదిసంవత్సరములకుఁ బైనఁ గూడదనియు శాస్త్రమందుఁ జెప్పఁబడియున్నది.

శ్లో. పంచాశద్వత్సరా దూర్ధ్వం నకుర్యా త్పాణిపీడనం.
కలౌ యుగస్య దుష్టత్వాత్ త్యాజ్య మాహు ర్మనీషిణః.
యువానం ప్రేషయే న్నారీ స్వయం జీర్ణాపి సర్వదా.
వ్యభిచారా త్కులం నశ్యేత్. కులనాశాత్కులాంగనాః
భ్రశ్యంతి. సంకరోభూచ్చ. సంకరో నరకాయవై
నరకం నానువర్తంతే. తస్మా ద్వర్జంతి పండితాః (గౌతమః)

అవివాహితురాలైన కన్యకకు రజోదోషము సంప్రాప్తమయ్యెనేని యది వృషలి యనియు దానిని వివాహముఁజేసికొన్నవాఁడు వృషలీపతియనియు వీరల కుద్భవించిన పుత్రుఁడు వృషలాత్మజుఁడనియు వారు మహాపాతకకోటిలోఁ జేరినవారనియు హవ్యకవ్యాదుల నుపయుక్తులు కారనియు నపాంక్తేయులనియు నిహమందు శూద్రప్రాయులనియుఁ బరమందు రౌరవాది నిరయమే వాసమనియు వారలకు సూర్యచంద్రు లుండువఱకు మరల బ్రాహ్మణ్యమే లేదనియు మఱుజన్మమందు శ్వైరవాకృతిగా జనించుచు

రనియు నంతకుఁబైఁ గల్పావసానమువఱకుఁ జండాలజన్మమనియుఁ గ్రిందివ క్యములు ఘంటాఘోషముగా శబ్దించుచున్నవి.

శ్లో. మాతాచైవ పితాచైవ జ్యేష్ఠభ్రాతా తథైవచ
త్రయస్తే నరకం యాంతి దృష్ట్వా కన్యాం రజస్వలాం.
యస్తాం సముద్వహేత్కన్యాం బ్రాహ్మణో మదమోహితః
అసంభాష్యో హ్యపాంక్తేయః స విప్రో వృషలీపతిః.
యఃకరోత్యేకరాత్రేపి వృషలీసేవనం ద్విజః
సభైక్ష్యభుగ్జపేన్నిత్యం త్రిభిర్వర్షైర్విశుధ్యతి. (పరాశరః)

శ్లో. బ్రాహ్మణో వృషలీం గత్వా త్ర్యహం భవతి సూతకీ
అథాస్యాం గర్భమాధత్తే బ్రాహ్మణ్యాదేవ హీయతే
తస్మాద్గుణవతే కన్యాం నగ్నికామేవ శక్తితః (యమః)

శ్లో. వృషలీగమనేచైవ మాసమేకం నిరంతరం
ఇహజన్మని శూద్రత్వం మృతశ్శ్వాచాభిజాయతే. (ముక్తాఫలం

శ్లో. పితుర్గేహేతు యా కన్యా రజః పశ్య త్యసంస్కృతా
సా కన్యా వృషలీ జ్ఞేయా. తద్భర్తా వృషలీపతిః. (కశ్యపః)

శ్లో. యా కన్యా పితృవేశ్మస్థా యది పుష్పవతీ భవేత్
అసంస్కృతాతు సా త్యాజ్యా న పశ్యేత్తాం కదాచన.
వివాహే నచ యోగ్యాస్యా. దిహాముత్రాపి గర్హ్యతే.
ఏతాం వివాహయన్ విప్రో నయోగ్యో హవ్యకవ్యయోః.
న తస్యాం జనయేత్పుత్రం. కానీన ఇతి కథ్యతే.
మాతా పితాచ తత్పుత్రః త్రయస్తే వృషలాస్స్మృతాః
యదా పుష్పవతీ కన్యా తదైవ త్యక్తు మర్హతి.
నతస్య దోషస్తస్యాస్తి. గృహేస్థిత్వా సదోషభాక్. (మార్కండేయః)

శ్లో. పితుర్గేహేతు యా కన్యా రజఃపశ్య త్యసంస్కృతా
సా కన్యా వృషలీ జ్ఞేయా. తత్పతి ర్వృషలీపతిః (హారీతః)

శ్లో. పితుర్గేహేతు యా కన్యా రజఃపశ్య త్యసంస్కృతా
భ్రూణహత్యా పితుస్తస్యాః సా కన్యా వృషలీ స్మృతా.
యస్తాం సముద్వహేత్కన్యాం బ్రాహ్మణో జ్ఞానదుర్బలః
అశ్రాద్ధేయ మపాంక్తేయం తం విద్యా ద్వృషలీపతిం. (అత్రిః)

శ్లో. యదా రహః పుష్పవతీ ద్విజ స్త్రీ ముద్వహేద్యది
కాలాంతరే యదా శ్రుత్వా తదా తాం సంపరిత్యజేత్.
యదీచ్ఛే దాత్మన శ్శుద్ధిం తదా చాంద్రాయణం చరేత్.
పుత్రోత్పత్తి ర్యదాభూచ్ఛ తదా పతిత ఏవ సః (గౌతమః)

శ్లో. వృషలీపతిశ్చ తత్పుత్ర షండోఽవీరా రజస్వలా
ఏతేతు శ్రాద్ధకాలేవై వర్జనీయాః ప్రయత్నతః. (యమః)

శ్రాద్ధకాలమందలి వీరిదర్శనమునఁ బితరులు పలాయనము చేయుదురని తాత్పర్యము

శ్లో. కుశీలవోఽవకీర్ణీచ వృషలీపతిరేవచ. (మనుః)

శ్లో. వివాహాత్పూర్వమేవం సా యదిస్యాత్తు రజస్వలా
సంత్యాజ్యైవ భవే న్నూనం తామేతాం తాదృశీం వధూం
యోజయే చ్ఛూద్రగోష్ఠీషు. బ్రాహ్మ్యేషు నకదాచన.
వివాహమధ్యసంప్రాప్తఋతుమత్యాశ్చ సంభవః
నాంగీకార్య స్సమైః సద్భిః. ప్రదూష్యో నిందిత స్త్వయం.
రండాపుత్రసమత్వేన నిఖిలై రవలోక్యతే
వ్యభిచారసముత్పన్నో హ్యాయం కేవలఏవవై
నయోగ్య స్సర్వకృత్యానా మితి శాస్త్రవినిర్ణయః. (లోకాక్షిః)

శాస్త్రముయొక్క ముఖ్యతాత్పర్యము.

త్రీణివర్షా ణ్యుదీక్షేత త్రీణివర్షాణ్యృతుమతీ మనెడి బోధాయనాది వచనముల యందుఁ బ్రయోగించియుండు ఋతుమతీశబ్దము ప్రత్యక్షముగా ఋతుదోషము సంప్రాప్తమైన స్త్రీపరము కాదు. అటులఁ దాత్పర్యము గ్రహించిన పక్షమందు శాస్త్రము మొత్తము నిష్ప్రయోజనమగును. ఇటుల ఋతుమతీవివాహము మన్వాదులచేఁ జెప్పఁబడిన బ్రాహ్మణసమూహమే పతితకోటిలోఁ బర్యవసాన మగుచున్నది. అంతట నాహ్నిక శ్రాద్ధాచారాశౌచాదులు నిర్ణయించుట వృథాయగును. ధర్మాధర్మములనెడి భేదము లుప్తమగును. ఇంత యనర్థమునకుఁ గారణమగును. దద్యా ద్గుణవతే కన్యాం నగ్నికాం బ్రహ్మచారిణే యని బోధాయనులును

శ్లో. ఆచ్ఛాద్య చార్చయిత్వాచ శ్రుతశీలవతే స్వయం
ఆహూయ దానం కన్యాయాః బ్రాహ్మో ధర్మః ప్రకీర్తితః

అనిమనువును ననృతుమతీవివాహము చేయవలయుననియే తెలియఁబఱచుచున్నారు కాని ఋతుమతీవివాహము చెప్పలేదు. అటులఁజేయుటవల్ల మంచి లోకాంతరములుగాని యిహమందు విశేషఫలప్రత్యక్షముగాని ధర్మార్థకామము లేవియు లేవు. ఏదియు లేకయుండినను బూర్వోత్తరము లాలోచించక యావచనముల వాస్తవార్థము వదలి యర్థాంతరము భావించి ధర్మాధర్మములు నిర్ణయించుటకుఁ బ్రవర్తించిన మన్వాదుల కపయశంబనెడి కాలువు కప్పి కోలాహలము చేయుటకుఁ గర్తలు పండితోత్తములా కలిపురుషుని ప్రభావమా యనెడి యాశంక పరిహారము కాలేదు. కలిపురుషుఁడే పండితరూపముధరించి యిట్టి దుర్బోధను జేసి యానేతుహిమాచలముఁ దలక్రిందు చేసినను

నింకను ననేకులు ధర్మానుష్ఠానతత్పరులుగా నున్నారని స్పష్టముగా నేర్పడినది. ఇందువల్లఁ బండితులు కొంచెము శాస్త్రవిచారము చేసి ధర్మాధర్మములు కనిపెట్టవలయునని యనేకుల యాసక్తి. ఋతుమతీవివాహము మన్వాదులచేఁ జెప్పఁబడియుండు బ్రాహ్మ్యాద్యష్టవిధవివాహములలోనిది కాదు. విపరీతఫలము దాతృప్రతిగ్రహీతలకు ధర్మశాస్త్రమందుఁ గనఁబడుచున్నది.

శ్లో. సప్తసంవత్సరా దూర్ధ్వం వివాహ స్సార్వవర్ణికః
కన్యాయా శ్శస్యతే రాజన్! అన్యథా ధర్మగర్హితః

అని వర్ణచతుష్టయ స్త్రీలవివాహమునకును ముఖ్యకాల మష్టమసంవత్సరమని భారతవచనము. ఆసంవత్సరము పిత్రాదులు చేయనిపక్షమందుఁ దొమ్మిది పది పదునొకండు సంవత్సరములు ప్రతీక్షించి తత శ్చతుర్థేవర్షేతు... సాకన్యావరయేత్స్వయమను మనువచనప్రకారము తప్పక వివాహము జరిపించుకొనవలయును. త్రీణి వర్షాణ్యుదీక్షేతయనెడి పదమునకుఁ దొమ్మిది పది పదునొకండుసంవత్సరములు పిత యాజ్ఞ కెదురుచూడవలయునని తాత్పర్యము. అత ఊర్ధ్వం రజస్వలాయనెడి శాస్త్రప్రకారము పదునొకండవవత్సరముననే సాంకేతికముగా రజస్వలయని నామము ప్రాప్తమగుచున్నది. పదునొకండవసంవత్సర మట్టి సాంకేతికఋతుమతీ (రజస్వలా) నామము పొందినదై "తత శ్చతుర్థే వర్షేతు" అనెడి శాస్త్రప్రకారము పదిరెండవసంవత్సరము దానపూర్వకముగాఁ గాని స్వయముగాఁ గాని తప్పక వివాహితురాలు కావలయునని తాత్పర్యము. పదిరెండవసంవత్సరము వివాహము చేయనియెడలఁ బిత్రాదులకు భ్రూణహత్యాపాపము విధించియుండుటవల్లఁ దప్పక చేయవలయును. యావద్వచనములును ననృతుమతీవివాహమునకు సాధకముగా నున్నవే కాని ఋతుమతీవివాహమున కొకవచనముకూడ సహాయము కానేరదు. (ఏ. పి. యల్)

---

## —♦ నిమ్మపండురసము ♦—

... నిమ్మపండు వెల దమ్మిడియే కాని యుపయోగ మత్యధికము ... అనేక విధములుగా నుపయోగించును. పైత్యమును హరించును. క్రిములను నాశింపఁజేయును ... రక్తమును శుభ్రపఱచును. ... నిద్ర లేవఁగానే ... నీళ్ళలో నిమ్మపండురసము పిండి ప్రతిదినమును త్రాగుచోఁ గనులు బాగుగాఁ దేటపడును. ముఖముపై మచ్చలు పోయి మంచి వర్చస్సు కలుగును. బొగ్గుపొడిలో రసము పిండి దానితోఁ దోమినచోఁ బండ్లు ముత్యములవలె నగును. ... చేతులకు రాసుకొని కడిగినచో సబ్బురుద్దుటవలనకంటెఁ జాల బాగుగా ... శుభ్రమగును. కిరసనాయిలు మున్నగువానిని దాఁకినవారిటులఁ జేసినచో నావాసన త్వరగాఁ బోవును. వేఁడినీళ్ళలో రసము పిండి దానితోఁ గడిగినను దుడిచినను ... మఱక లన్నియు వెంటనే పోవును. ఇత్తడిపాత్రలను శుభ్రపఱచుటకు మొదట రసము నొకగుడ్డపైఁ బిండి యాగుడ్డతోఁ దుడువవలెను. అపుడు ... శీఘ్రముగా మెఱుఁగువచ్చును. ఆమెఱుఁగు త్వరగాఁ బోదు. పండు కోసి ముక్కలను నీళ్ళలో వేసి యానీళ్ళు మఱుఁగుచున్నపుడు మాసినబట్టలను ... కొంతసే పుడుకఁబెట్టినచోఁ గ్రొత్తబట్టలవలెఁ దెల్లగా నగును. ఈరీతిగా నిమ్మపం డనేకవిధములుగా నుపయోగించును. దాని యుపయోగములను లెక్కించ నలవికాదు.

(బర్మా మెడికలు టైమ్సు)

ఉ. కారణ మాపదావళి, కఖండమనోరథసంచయాళి కం
కూరము, ధుర్మనోవ్యథలకుం గుదు, రాత్రికి జన్మభూమి, సం
సారమహీరుహంబునకు సారతరం బగుమూల, మియ్యహం
కారముఁబోలు శత్రువు జగంబున లేదు మునీంద్రచంద్రమా! 69

క. చిరకాలవైరి యగు నీ
దురహంకృతి కోడి, యశనతోయము లెఱుఁగన్
గురునాథ! రాజభోగో
త్కరముల నిఁకఁ బొందు టెట్లు తాత్పర్యమునన్? 70

క. ఆయతసంసారనిశన్
మాయావాగురల నొడ్డి మౌనీశ్వర! యీ
హేయాహంకారం బను
బోయఁడు నరమృగచయంబుఁ బొలియించుఁజుమీ. 71

తే. విషమములు, దీర్ఘములు, బహువిస్తృతములు
నయినదుఃఖంబు లెవి గల వవ్వి యెల్ల
మునివరేణ్య! యహంకారముననె పొడము
క్ష్మాధరంబున ఖదిరవృక్షంబులట్లు. 72

వ. కావున 73

క. శమచంద్రరాహువక్త్రము,
సమతాబ్జశరత్సమయము, సద్గుణపటలీ
కమలహిమ మగునహంతను
విమలాత్మా! యెట్లులైన విడిచెద నింకన్. 74

ఉ. రాముఁడఁగాను నేను మునిరాజ! మదీయమనంబు మందిరా
రామధనాదివస్తునికరంబులపై రతిఁజెంద దింతయున్
భూమి సమస్తభూతముల బుద్ధునిరీతి విమత్సరుండనై
శ్రీమహితప్రశాంతిని వసించెద మోహము సంత్యజించెదన్. 75

తే. ఈయహంకారవశుఁడనై యే నొనర్చు
సర్వకర్మము లమితతుచ్ఛమ్ము లగును
ఇది వినా యొనరించిన యెట్టికర్మ
మయిన సారతరం బయి యలరెయిల్లు. 76

క. మునివర! 'నే' ననునది గ
ల్గినయెడ వగఁ గాంతు, నద్ది లేనియెడ సుఖ
మ్మెనయుదు, నిది తలపోయఁగ
ననహంకృతి మేలుగాదె యన్నిటికంటెన్? 77

క. కావున నహంకృతిన్ విడి భావంబున శాంతిఁ బొంది భంగురభోగే
చ్ఛావర్జితుండ నయి, దేవా! విగతోద్వేగవృత్తి వర్తిలువాఁడన్

క. ఎంతనుక మనోవ్యోమమునందు నహంకారవారిదావళి యలమున్
అంతనుక ఘనవికాసము నందుం దృష్ణాఖ్యకుటజ మనఘగుణాఢ్యా!

తే. ఈయహంకారవారిద మెప్పుడు విచ్చు
నపుడె యాశాతటిల్లత యడఁగిపోవు
తైల మంతయు వ్యయమైన తత్క్షణమున
దీపశిఖ యారునట్లు సుధీప్రకాండ! 80

తే. ఈయహంకార వింధ్యగిరీంద్ర మెక్కి
చిత్తమత్తేభ ముత్సాహవృత్తి నఱచు
ఆకసంబెల్లఁ గ్రమ్మి నీలాంబుదంబు
ఉల్లసంబునఁ జేర్చి గర్జిల్లునట్లు. 81

తే. విపులకాననమందు గర్వించి తిరుగు
మృగపతివిధాన నెప్పు డిమ్మెనఁ జెలఁగు
నియ్యహంకారమునఁ జేసియే జగంబు
విస్తరింపఁగఁబడియెఁ గోవిదవరేణ్య! 82

క. ఆతతతృష్ణాతంతు
ప్రోతము బహుజన్మపాళిముక్తారత్న
ద్యోతము నగు మణిహారము
తాత! యహంకారవిటుఁడు తాల్చు గళమునన్. 83

తే. ఔర! యేమన నగు? నహంకారవైరి
లీల నేమంత్రతంత్రముల్ లేక యితఁడు
తనకుఁ గైవస మొనరించుకొనియె జనుల
దారపుత్రాదు లనెడు బంధము తగిల్చి. 84

క. మునివర ! యహము నశించిన
యనుపదమె నశించు ఘనదురాధు లవెల్లన్
ఘనమునఁగల సమ్మోహము
జను, మేఘము లడఁగ హిమము సమయువిధానన్. 85

మ సకలాపన్నిలయంబు నధ్రువము హృత్సంస్థంబు నత్యంతదుః
ఖకరంబున్ గుణవర్జితం బగునహంకారంబు నే నొల్లఁ, గౌ
శికమానీశ్వర ! ఘోరమోహవశతన్ జింతిల్లుచున్నట్టి నా
కకలంకంబగు తత్త్వబోధ మిడి నిత్యానందుఁ గావింపవే. 86

వ. అనిపల్కి శ్రీమ్మఱ రాఘవుం డిట్లనియె. 87

## —♦ మ నో నిం ద ♦—

శా. చేతంబన్నను సాధుపూరుషుల సంసేవల్ విసర్జించి దు
శ్చాతుర్యంబున దోషసంచయమునన్ సంసక్తమై జీర్ణమై
వాతాంతశ్చలబర్హిబర్హసమ చాపల్యాన్వితంబై యధః
పాతంబుం గలిగించు మానవునకున్ బ్రహ్మణ్యగణ్యప్రభా! 88

తే. గ్రామమందున శునకంబుకరణి వితగ
నిటునటులు దైన్యమునఁ బర్వులెత్తుఁ ద్వరగ
అనుభవింపదు నిండదు ధన మదెంత
గలిగినఁ గరండకం బుదకములఁబోలె. 89

క. వేరాస గలలలోఁబడి యూరక యారాటమందుచుండు, నొకప్డే
నూఱట చెందక వగచున్ సారెకుఁ దనమంద విడినసారంగమటుల్.

క. జలనిధికెరటముగతిఁ జం
చల మగుచు విశీర్ణ మగుచుఁ జాల వికారం
బుల నందుఁ గాని యెపుడున్
నిలువదు ధ్యానాదులందు నిముసంబేనిన్. 91

ఆ. విషయచింతనమున విక్షుబ్ధ మగు మాన
సంబు చెదరిపోవు సకలదిశల
మందరంబుచేత మథనమందినదుగ్ధ
వారిరాశిలోని క్షీరమట్లు. 92

శా. లోలానంతమనోరథప్రచయకల్లోలాంచితావర్తమై
మాలిన్యాఖ్యనిషద్వరప్రచురమై మాయామహానక్రమై
ఆలస్యాచలవాసమై తనరు చిత్తాబ్ధిన్ నిరోధింపఁగా
జాలన్, సంయమినాథ! యేగతి నిఁకన్ సాధింతు విశ్రామమున్?

క. దూర్వాంకురాశ మదిలోఁ
బర్వఁగఁ జెనుగోతిలోనఁ బడు టెఱుఁగక తాఁ
బర్విడు హరిణకమటు మది
యుర్వీసుర! భోగవాంఛ నుఱుకు దెసలకున్. 94

క. చింతాచంచల మగుమత్స్వాంత మ్మొకతలమునందు స్థైర్యముగనదొ
క్కింతయుఁ బంజరబంధనసంతప్తమృగేంద్రమట్లు సంయమినాథా!

తే. కాయ మనియెడి జలమునఁ గలిసియున్న
భూరిసమతాసుఖంబను క్షీరములను
మానసంబను రాయంచ మౌనినాథ!
మొనసి విడఁదీసి రుచిహీనముగ నొనర్చు. 96

తే. విషయసంసక్తిశయ్యపై విశ్రమించి
నిదురచెందెడి మామకహృదయవృత్తు
లెంతటిప్రబోధమునకైన నుంత మేలు
కొనకయున్నవి దీనికై వనరుచుంటి. 97

తే. దృఢతరగ్రంథియుతమైన తృష్ణ యనెడు
పాశములచేత నల్లఁగాఁబడినయట్టి
చిత్తనామకవాగురన్ జిక్కుపడిన
పక్కినై యిట్లు మౌనీంద్ర! పొక్కుచుంటి. 98

క. అనవరతకోపధూమము ఘనచింతాహేతియుతము కామోష్ణమునై
తనరారు మానసాగ్నికి ననఘా! నే శుష్కతృణము నైతినిజమ్ము.

తే. తృష్ణ యనుభార్య వెన్నంటి తిరుగుచుండు
క్రూరచిత్తంబు జడు నన్ను ఘోరముగను
మ్రింగుచున్నదిసుమి సంయమిప్రకాండ!
మృతశరీరంబు శునకంబు మ్రింగునట్లు 100

క. మునినాయక ! జడరూపయు
ఘనతరకల్లోలజాలకలితయు నగు నా
మనము నను నీడ్చుచున్నది
పెనువాహిని తీరతరువుఁ బెకలుచురీతిన్. 101

క సుడిగాలి తృణముఁ గొనిచని వడి నెల్లెడఁ ద్రిప్పురీతి బహుజన్మములం
బడవేసి త్రిప్పుటకై నను జెడుమది దూరస్థలములఁ జేర్చుచునుండెన్.

క. భవజలధి దాఁటఁ బోవఁగ నవనీసుర! నాకుఁ జిత్త మడ్డంబయ్యెన్
బ్రవహించు జలౌఘంబునకవిరళఘనసేతు వడ్డమైనవడుపునన్. 103

క. పాతాళమునుండి భువికి
భూతలముననుండి భుజగభువనంబునకున్
జేతము ననుఁ గొనిపోయెడి
నేతపుగడ నల్పరజ్జు వీడ్చు తెఱఁగునన్. 104

ఆ. కల్లరూపుతోడఁ గడు గొప్పదై యుండు
నరసిచూడ నాశ మందుచుండు
ఇట్టిపాడుమనసు పట్టియున్నది నన్ను
బాలకునిఁ బిశాచి పట్టినట్లు. 105

చ. అనలము మ్రింగుకంటె లవణాంబుధి గ్రోలుటకంటె వజ్రభే
దన మొనరించుకంటె వసుధాధరదుర్గమతుంగశృంగరో
హణ మొనరించుకంటెఁ గనకాచలముం బెకలించుకంటె నీ
మనమును నిగ్రహించుటయె మౌనివరేణ్య! కడున్ శ్రమంబగున్.

ఆ. మనము విషయములను మగ్నమౌ వేగ రా
బందు వామిషంబునందుఁ బోలె
మంచిపనుల నెల్ల మాను నాటలకునై
మాణవకుఁడు చదువు మానునట్లు. 107

క. దేవ ! జడప్రకృతియు వితతావర్తకవృత్తిలోలమహితవ్యాలం
బై వఱలు మనోవార్ధి మహావేగముతోడ నన్ను నాకర్షించున్.

ఆ. మనసు కారణంబు మహి నర్థముల కెల్ల
మనసు కలుగఁ గలదు ఘనజగంబు

మనసు లేకయున్న మఱి జగంబె లేదు
ఎట్టులైన దీనిఁ గట్టవలయు. 109

చ. అవనిధరేంద్రమందు విపినావళు లుద్భవమందురీతిగా
నవిరళతర్ష జనించు మనమం దెపుడుక్ సుఖదుఃఖముల్ వివే
కవశత నీమనం బణఁచఁగల్గినఁ దత్సుఖదుఃఖనాశనం
బవు సులభంబుగా ననుచు నాత్మఁ దలంతు మునీంద్రచంద్రమా!

ఆ. విబుధవర్య లెద్ది విదితం బయినయంత
సకలగుణజయాశఁ జాలఁ గండ్రు.
అట్టి చిత్తవైరి నణఁచఁగోరెడినాకు
లచ్చియందు సుంత యిచ్ఛ లేదు. 111

వ. అని పలికి శ్రీరామభద్రుండు మరల నిట్లనియె. మునిపుంగవా!
మఱియొక్కసంగతి విన్నవించెద నవధరింపుము 112

## —♦ తృష్ణానింద ♦—

తే. తృష్ణ, యీజీవజాతంబు తెలివి నణఁచి,
దోషసంఘంబున కొసంగు దోహదంబు
కటికిచీఁకటి దెసలెల్లఁ గలయ నలమి
గూబతండంబునకుఁ బెంపు గూర్చునట్లు. 113

క. పంకజబంధుని రశ్మికిఁ
బంకము శోషించునట్లు పటుతరతృష్ణా
సంకటమున నీరసమయి
యింకుచునున్నది మదీయహృదయము తండ్రీ! 114

తే మోహతిమిరాకులము శూన్యమును నయి తగు
మామకీనమనోఽరణ్యభూమితలము
నాశపేరిటి పెనుబూత మాక్రమించి
తాండవించుచు నున్నది తాపసేంద్ర! 115

తే. దీనవచనాశ్రునీహార దీపితయును
గాంచనసమీపగత వికాసాంచితయును
నయిన తృష్ణాచణకగుచ్ఛ మవనిదేవ!
పొదలుచున్నది మామక హృదయసీమ. 116

తే. తరళితాంతర యగు తృష్ణ కరముఁ బెరిఁగి
మించి యంతర్భ్రమంబుఁ గల్గించుచుండె
వారినిధి నూర్మి యధికజవాన లేచి
భీకరావర్తములను గల్పించునట్లు. 117

క. ఉరుకల్లోలారావయుఁ దరళాకారయును నగుచుఁ దనరెడుతృష్ణా
ఝరి మామకదేహం బనుగిరిపైఁ బ్రవహించుచుండెఁ గిల్బిషదూరా!

ఉ. మామక చిత్తచాతకము మౌనివరేణ్య! స్వకీయచాపలం
బేమెయినైనఁ బాపుకొన నెంచి కడంక వహించి ధర్మమే
ఘామృతపానముల్ సలుపు నాస్థఁజరింపఁగఁ దృష్ణ దాని నెం
దో మరలంగ ద్రొబ్బు వడి నుగ్రపువాత్య జరత్తృణంబటుల్. 119

తే. ఘన వివేకవిరాగాదిగుణములందు
నెట్టియాస్థను నే వహియించుచుందు
దాని నీతృష్ణ ఖండించుఁ దత్క్షణమునఁ
గొక్కు వలిపెంపువలువను గొట్టునట్లు. 120

శా. ఆవర్తంబున జీర్ణపర్ణమటు వాత్యన్ శుష్కఘాసంబటుల్
ద్యోవర్త్మంబున శారదాభ్రమటు లత్యుగ్రానిలక్షుబ్ధపా
రావారంబునఁ బోతమట్టు లతిదుర్దాంతంబులౌ చింతలన్
దేవా! నే భ్రమియించుచుంటినిజమీ తృష్ణానిదానంబునన్. 121

తే ఆత్మవాసంబుఁ జేరంగ నరుగలేక
చింతలం జిక్కి మోహంబుఁ జెందుచుంటిఁ,
దన కులాయంబు నెడఁబాసి, దారి తప్పి
వలఁ దగుల్కొని విలపించు పులుఁగురీతి. 122

తే ఆసపేరిటి పెనుమంట యావరించి
కౌశికమునీంద్ర! నను బిట్టు గాల్చుచుండె,
నిమ్మహాదాహ మమృతసేకమ్ము చేత
నైన శమియించునట్లుగాఁ గానఁబడదు. 123

వ. వెండియు నీతృష్ణ యున్మత్తతురంగమి తెఱంగునఁ బలుమాఱు
దూరప్రదేశంబులకుఁ బోవుచు మరలివచ్చుచు దిగంతంబులం బరి
భ్రమించుచు; ఘటీయంత్రాగ్రరజ్జువు చందంబున సంచలితయు

గ్రంథియుతయు జడసంసర్గిణియు నై యూర్ధ్వాధోగమనంబు లొనర్పుచుఁ గృష్ణభోగినిభాతిఁ గుటిలయుఁ గోమలస్పర్శయు విషవైషమ్యదాయినియు నై ప్రవర్తిలుచు, శాకసాంగనభంగి మాయామయవిధాయినియు మనుజహృదయభేదనకారిణియు దౌర్భాగ్యదాయినియు నై దైన్యంబుఁ గూర్చుచు జర్జరవల్లకివలెఁ దంత్రీగణపరివృతకోశధారిణియై యనానందకారిణి యగుచు గహ్వరవల్లరితీరున మలినయుఁ గటుకోన్మాదదయు నై విపులంబుగ నల్లుకొనుచు, శుష్కమంజరిగతిఁ గరుణాప్రదాత్రియు శూన్యయు నిష్ఫలయు నమంగళకరయు నై తనరారుచుఁ జపలబర్హిణిసరణి నీహారనిరాహాచారిణియు శారదాలోకాసహమానయు నై దుర్లంఘ్యపదంబు నవలంబించుచుఁ, బ్రావృట్కాలతరంగిణికరణి జడకల్లోలబహుళయుఁ జిరకాలశూన్యయు క్షణోల్లాసధారిణియు నగుచు దైవచేష్టవడువున శుభాశుభకార్యంబుల ననుసరించుచు జలదమాలికపోలిక జాడ్యదయుఁ బరమాలోకరోధినియు మోహనీహారగహనయు నై పరగుచు, బంధనరజ్జువురీతి సంసారవ్యవహారంబుగల సమస్తజంతుసంతానమనోమాలికలకుం బ్రధానబంధంబై యొప్పుచు, శక్రశరాసంబుచాడ్పున విచిత్రవర్ణయు విగుణయు దీర్ఘయు శూన్యయు శూన్యాశ్రయయు నై కానుపించుచు వేణులతికవిధంబున నంతశ్శూన్యయు గ్రంథిమతియు దీర్ఘనిజాంకురకంటకయు నై ముక్తామణిప్రియత్వంబుఁ జూపుచు, వింధ్యతటిమాడ్కి సంస్తీర్ణగహనయు భీమయు ఘనరజఃప్రచురయు నంధకారబంధురయు నై చూపట్టుచు సకలజంతుసంతానంబునకు సంసరణకారణం బగుచున్నది. ఇదియునుం గాక 124

క. అంతర్గ్రథితంబై యత్యంతము దుశ్ఛేదమైనయాశానాసా
తంతువు నరవృషభంబులఁ జింతాభారముల మోయఁ జేయుచునుండుఁగా

తే. నిత్యకర్షణశీలయై నెగడు తృష్ణ
దారపుత్త్రులవేరి బంధం బమర్చి
మనుజులను గట్టు వలవైచి వనవిహంగ
చయముఁ బట్టెడు చెంచుచేడియవిధాన. 126

# ఇల్లాలు

## ( నాల్గవ భాగము )

### సంతానము.

తే. యోగ్యమతులును మఱియు నారోగ్యయుతులు
సుతులు గలిగినయట్టి దంపతుల కలుగు
సంతసము దుర్లభం బొందుసౌఖ్యవితతు
లెన్ని గలవారికేనియు. ఇది నిజంబు.

... లోకమున వివాహమైన యాలుమగల కెల్లరకు నిజమగు ననురాగము సంతతి కలిగిన యనంతరమే కుదురును. భర్తయందును భార్యయందుఁ బ్రతిఫలించి దాంపత్యైకమత్యమును దృఢపఱచును. ఇరువురి ప్రేమప్రవాహమునకును గమ్యస్థాన మొక్కటియే యగును. మానవకోటికిం గల యిహసౌఖ్యము లన్నిటిలోని యగ్రగణ్యము. బిడ్డలఁగన్నసుఖము గొడ్రా లెఱుఁగదన్నట్లు సంతానసుఖప్రాప్తి లేనివారికి దాంపత్యసుఖము కొఱంతయే యని నిశ్చయముగాఁ జెప్పనగును.

తొట్లలోఁ బరుండి శిశువు లవ్యక్తమధురధ్వను లొనరించునపుడు గాని చేతులం గదలించుచు నోట నుంచికొని చుంకించుచు నవ్వునపుడు బోరగిలునపుడును నేలపైఁ గూర్చుండి పాకాడుటకు లేచుటకు యత్నించుచు సమీపస్థులం గాంచి రమ్మెత్తుకొమ్మని చేతు లాచించునాఁడును దప్పటడుగు లిడుచు వచ్చియు రాని సగముసగము మాట లాడుచు ముద్దులుగొలుపు నాఁడును దమ శిశువులం గాంచినంత నుప్పొంగు ప్రేమాతిరేకంబున నెత్తి ముద్దాడ నోఁచనివారికి దాంపత్యసౌఖ్యము కొఱంత గాదనిన సరియగునా? భుజించనివారికి రుచి దెలియదన్నట్లు సంతానసుఖప్రాప్తి లేనివారి కిది యవేద్యము. బిడ్డల ముద్దాడ నలవాటు గలవారికిఁ దఱుచుగ శరీర ముప్పొంగి వక్షస్స్థలోపాంతప్రదేశ మెల్ల సుస్నిగ్ధమగుచుఁ జలన మంకురించును. ఆ యాహ్లాది శిశుపరిరంభణాదులం గాని యాహ్లాదన మందఁజాలదు. ఇట్టి యానందానుభవము లేనివా రిహసుఖానుభవము లేనివారనియే చెప్పనగును.

ఎంతకఠినహృదయులుకలవారైనను బసిపిల్లల కోమలాంగకములం గాంచియు వా రుచ్చరించు మధురధ్వను లాలించియు మార్దవము నందఁగలరన వారి తలిదండ్రు లట్టిచిరునామముల నెట్లు సుఖముందురో వర్ణింప నెవరితరము? దినకృత్యములం దాయాసములంది యిల్లుచేరిన తండ్రికిని గృహకృత్యములచే నలయుచుండు తల్లికిని బిడ్డల యాలాపములును మురిపెంపుఁజేష్టలును నేత్రశ్రోత్రపేయములై

వారిమనంబుల నలయించిన కష్టమును విసుగును మఱపించి పరమానందభరితులఁ గావించఁగలిగియుండును. శిశులీల లెట్టిదుఃఖములనైన నివారించఁగలవు. లోకము నంగల స్త్రీజనంబులకుఁ దఱచు గలుగుచుండు విచారముల నడఁచి సాహస కృత్యముల నివారించి వారల కాశలంగొల్పు పరమామృతము లీశిశులీలలే. నష్టములచేతను గష్టములచేతను డిల్లపడినవాఁడు నిరాశచే నిష్పృహ చెందకుండఁ దండ్రుల కాశాంకూరము లొదవించి పురోవృద్ధి కువ్విళు లూఱం చేర్చేచు మహాసాధన మీసంతానమే కాని మఱియొండు కాదు.

లోకుల ముప్పాతికప్రయత్నము సంతానముకొఱకని చెప్పిన నతిశయోక్తి కాదు. మానవకోటిని వివాహమాడనివా రరుదుగ నుందురు. వివాహమాడుట సంతానప్రాప్తికొఱకని యెల్లరు నెఱుఁగుదురు. కొందఱుమాత్రము సంభోగసిద్ధి కొఱకని చెప్పవచ్చును. కాని సకాలమున నట్టివారికి సంతానప్రాప్తి కలుగనప్పు డాకొఱంత కొండంతగఁ దోఁచి సంతానముకలుగుట కెంతలేసికార్యములనైనను జేయ సమకట్టుచుందురు. దినదినము నిది మన కన్నులముందఱ జరుగుచున్న పనియే.

తే. చంటిబిడ్డలఁ గనిన చిరంటులెల్ల
రెత్తి వారిని ముద్దాడి యింపుమీఱ
తమకు నటువంటిబిడ్డలు దైవకరుణ
ఓలిఁ గలుగంగ నువ్విళులూరుచుండ్రు.

తరుణమునఁ దమకు నట్టిపసిపిల్లలు గలుగవలెనని కోరనివారు భగవంతుని వేడనివారు నరుదు. కావున నట్టివా రెల్లరును ముందుగ శిశూత్పత్తిపోషణాది వివరము లెఱిఁగియుండు టావశ్యకము. అట్లెఱిఁగియున్న యిల్లాలి సంతతియే సత్ప్రవర్తనగలవారుగ నారోగ్యవంతులుగ నొప్పారుచుందురు.

క. బిడ్డలఁ గనుటకుఁ బూర్వమె
బిడ్డల లాలించి యోర్చి పెంచెడు విధముఁ
గడ్డుకొనియుండ నేరిచి
బిడ్డలఁగను తల్లి ముదము పెంపొందు భువిన్.

భార్యాద్వితీయుఁడుగఁ బడుకటింటియందు సుఖాసీనుఁడైయున్న గణపతి శాస్త్రి తన యుపన్యాసమంజరినుండి పైయంశములు చదివి ప్రియసఖివంకఁ జూచెను. కృష్ణాబాయియుఁ దన కీయంశముల బోధించు తలంపున భర్తచదువు చుండు టెఱిఁగి విషయగ్రహణ మొనరించుచుఁ దనకు నెలతప్పినసంగతి నిమిటి గ్రహింపఁగలిగెనా యని యాలోచించుకొనుచుండెను. కాని తనకు సహజమగు దరహాసాననవికాసము నెంతమాత్రము మాఱనీక విన నింపుగలదనుట తెలుపున ట్లూరకుండెను.

గణ:— నీ కిప్పట్టునఁ దెలిసియుండవలసిన కొన్ని యంశముల బోధింప నుద్దేశించితిని. సావధానముగ వినుము సంతానము కను నీడుగలవా రెఱిఁగియుండవలసిన

యంశములు. పెక్కండ్రీయంశము లెఱుఁగకే బిడ్డలను బెంచుచుందురు. కాని విషయ మెఱిఁగి పెంచిన వారలకు మిగుల సహకారి యగును.

కృ:– (కించిల్లజ్జావనతవదనయై తల వంకించును)

గణ:–సీ. భువిఁ బుష్పవతులైన పుణ్యాంగనలు (శౌచ
మానంబులను నొంటి మనఁగవలయు)
మూఁడురాత్రులు శుభమ్మును గోరుకొంచును
స్నాన మాభరణముల్ మానవలయు.
కోలఁదిగఁ బచ్చిమూఁకుట శుష్కపత్రిన
చేతనైనది దిన్పు క్షితితలమున.
దర్భలం బండుచుఁ దఱి స్నాన మొనరించి
ధౌతవస్త్రము దాల్చి ధవుని గాంచి
పగటినిద్ర మఱియు బైటఁ దిరుగుటయు
వదలికొన్న మంచిప్రజ జనించు.
మొదటిమూఁడుసార్లు ముఖ్యముగా నిట్లు
జరుపుకొనుట ముఖ్యసరణి వినుము.

ర(జోదర్శనా)నంతరముననే స్త్రీలకు గర్భోత్పత్తియగున దెల్లరు నెఱుఁగుదురు. కాని సత్సంతాన మొందుట కవు డవలంబించవలసిన నియమము లంతగ నెఱుఁగరు. పైపద్యమున ముఖ్యనియమములు కొన్ని మాత్రము వివరింపఁబడినవి ... పగటినిద్రచే నిద్రపోతులును జలనము గావించుటచేఁ జపలచిత్తులును స్నానగంధాదులచే మందబుద్ధులును నవ్వుచుండిన నల్లనిచిగుళ్ళుగలవారును గోళ్లు గిల్లికొనుచుండినఁ బుప్పిగోళ్ళవారును రోదనముచే రూపహీనులును గాటుకఁ బెట్టుకొనిన గుడ్డివారును బుట్టుదురని శాస్త్రవేత్తలు తెలుపుచున్నారు. ఇట్లు ప్రతిమాసము ర(జోదర్శన)సమయమున జరుపుట కష్టమైనఁ దొలిమూఁడుసారులైన నాచరించుట విధి. సాధారణముగ స్త్రీలెల్లరును దమకు గర్భధారణయోగ్యత కలిగినది మొదలు సంతానము కలుగవలెనని కోరుచుందురు. ... గర్భోత్పత్తివిధము సామాన్యస్త్రీ లెఱుఁగఁజాలరు కాని తెలివిగలవారు తోడనే ... తెలిసికొనఁగలరు.

కృ:– (కొంచెము ముఖవికాసము మార్చి యంతలో నెప్పటియట్లు వినయాన్వితయైన ట్లగుపడెను).

గణ:–గర్భిణీస్త్రీలు గమనించవలసిన విషయములు.

1 గర్భధారణకాలమందుఁ దల్లి యారోగ్యముగ నుండిన శిశువులు బలముకలవారగుదురు.

2 తల్లిమనమునఁగల సుఖదుఃఖములు శిశువుల మనంబుల నాటును.

3 కడుపునిండ భుజింపవలెను. కాని సులభముగ జీర్ణమగు పదార్థములనే గ్రహించవలెను.

4 మనంబున జనించు కోరికలు దీఱఁ దేలికగ నితరవస్తువులఁ గనిపెట్టి పుచ్చుకొనవలెను.

5. బట్టకట్టు వదలుగ నుండవలెను.

సీ. గర్భిణుల్ పురుషులఁ గవయుట పేరెము
వాఱుట దుముకుట వదలవలయు.
ఉపవాస ముండుట యుయ్యేల లూఁగుట
బరువుల నెత్తుట దొలఁగవలయు.
అత్యంతముగఁ గార మాహారించుట జల
మలనిరోధములును మానవలయు.
పగటి నిద్రయు రాత్రి మిగుల జాగరమును
ఆగ్రహాశ్చర్యమ్ము లాఁగవలయు.
అలుపు గలిగించుకర్జముల్ సలుపరాదు.
నగ్న కాస్నాన ముపధిఁ దానంబుఁ దగదు.
కటికి నేలపైఁ గూర్చుండఁ గడఁగరాదు.
చెఱువులను నూతులను సమీక్షింపఁ దగదు.

స్త్రీజన్మమున కెల్ల ముఖ్యమగు రెండుమూడవసలకాలమునకే సంతానప్రాప్తి. ఆర్తవకాలము దాఁటినవెనుక సంతానము కలుగదు. నెలనెలయం దార్తవ మారంభమైన వెనుకఁ బదునాఱవదినమువఱకు గర్భోత్పత్తి కావచ్చును. ఆర్తవప్రారంభదినానంతర మెన్నిదినములు జరిగిన నంత మంచిసంతానము కలుగుననియు సరిదినముల గర్భోత్పత్తిచేఁ బురుషశిశువు, బేసిదినముననైన స్త్రీశిశువు జన్మించెదరనియు ననుభవవేత్తలు నిశ్చయించియున్నారు ఈపదునాఱు దివసములం దాఱు పదుమూడు రోజుల సాంగత్య మతిమాన్యసంతానోత్పత్తి కారకమనియుఁ బదునైదు పదునాఱుదినముల సాంగత్య ముత్కృష్టమసంతానజనక మనియు వక్కాణించియున్నారు. మొదటిమూడుదినములును మృతసంతానకారకములగుటచే మనవా రట్టితఱి స్త్రీల నంటరానిస్థితియం దుంచియున్నారు.

గర్భధారణమైన సంగతి ధ్రువముగఁ దెలిసిన వెనుకఁ బురుషులం గూడుటయు నాయాసముకలిగించు పను లొనరించుటయుఁ గూడదు. శోకమును భీతియుఁ గలిగియుండుటయు వేఁడిపదార్థములు తినుటయు నడచి ప్రయాణము చేయుటయుఁ గూడదు. గోరువెచ్చనినీరు తప్ప మిగుల వేఁడినీరు స్నానము చేయరాదు. ప్రసవవేదనపడుకాంతలఁ గాంచుటయు నట్టితావుల కరుగుటయుఁ గఠినప్రస్తావనల నాలకించుటయు వర్జనీయము. అజీర్ణముపుట్టించు నూడిదల నారగించుటయు నాకుకూరలుఁ బచ్చికాయలుఁ దినుటయు నపాయకరములు.

ఇతరులు కోరిన పను లొనరించుటచేతను నూతనపదార్థసందర్శనముచేతను గోరిన యాహారపదార్థముల నమర్చుటచేతను సత్సంతానము కలుగును. అటులు గాక నిర్బంధము లొనరించిన గర్భవిచ్ఛిత్తి గలిగినఁ గలుగవచ్చును. వేఁకటికోరికలలో నేయింద్రియమున కాహ్లాదము గలిగించుపదార్థము లభింపదో గర్భస్థశిశువున కాయింద్రియమునకు వైకల్యము కలుగును.

కృ:— (విని సంశయాకులితయై భర్తృముఖమువంక చూచెను.)

గ:— నీ కీయంశమున సంశయము పొడముచున్నట్లున్నది. అనుభవజ్ఞులు లోకోపకారార్థము గ్రంథస్థమొనరించిన యొకటిరెండు కథలఁ దెల్పెదను వినుము. ఒకానొక గర్భిణి పొలమునం దిరుగుచుండ నొకపా మామె కుడికాలి పిక్కకుఁ బెనవేసికొనెను. ఆయమ భయభ్రాంతయై కేకలు పెట్టి మూర్ఛనందెను. సమీపవర్తులురికివచ్చి యాపామును సంహరించి యామె కాపన్నివారణ మొనరించిరి. కాని యామె ప్రసవమైన వెనుక నాశిశువు కుడిపిక్కకుఁ బాము చుట్టుకొనినట్లు మచ్చ యేర్పడి యుండెను. అంతర్వత్ని యొకరితె యొంటిగ నింటనున్నతఱి నొక యెలుక యామె కుడిభుజముపైఁ బడెను. ఆమె కడుంగడు భీతిల్లి పిదప శాంతిగనెను. ఈయెలుకరూప మామెకుఁ గలిగిన శిశువు కుడిభుజమున మచ్చగ నేర్పడియుండెను. ఇట్టి వెన్నియేని యుదాహరణముల నారసి తెలిసికొనఁ గలము. ముఖ్యముగఁ దెలిసికొనవలసిన విషయాంతరము లధికముగఁ గలవు. కావున నవి తెలిపెదను. స్త్రీల దేహము లతికోమలములు. కావుననే కోమలి యనిన నెలంతల కర్థమిచ్చు రూఢిపద మైనది. శరీరములతోపాటు వారి బుద్ధియుఁ సుకుమారము. వా రెప్పుడును గార్శ్యము కలిగించునంతటి కష్ట మొనరించుచుండిన శరీరములు మోటువాఱి మిగులఁ గోమలములు సుకుమారములు నగు శిశువు నంగకముల మెలఁకువతో నరసి మృదుతరములుగాని తమ యవయవముల స్పర్శచేఁ దగునటుల సంరక్షింపఁ జాలకుందురు. దేహము సళ్ళువాఱియుండినఁ గాని శిశువులకు వలసినన్ని పాలుండవు. కాయకష్టముచేఁ బాలూఱుట తఱుఁగుచుండును. పశువులందును నావులు గేదెలు మొదలగువానిం గృషియందుపయోగించిన నవి కట్టి యీనవు. ఒకవేళ నటుల జరిగినను వాని దూడలు జీవింపవు. స్త్రీజాతిపశువులతోపాటుగ మనస్త్రీలును సంతానవతులగునట్లుంచఁదగినవారని గృహస్థు లందఱు నెఱిఁగియుండవలసిన విషయము. ఇందుకు విరుద్ధమగు ప్రకృతిగలవారు లోకమున నుండవచ్చును. కాని జనసామాన్యముంగూర్చి పై నియమములు వివరింపఁబడినవి. శరీరము మిక్కిలి బలిసి కొవ్వుపేరినవారికిని కుష్కాంగులకును గర్భోత్పత్తియగుట దుర్లభము. కావున నెలంతలు వ్యాయామాంతరము లుడిగి యథోచితగృహకృత్యము లొనరించుట సమంజసము. స్త్రీలు కఠినకృత్యము లొనరించరాదనినఁ గేవలము తినికూర్చుండరాదు. అటులైనఁ గఠినములగు పను లొనరించుటకంటె నధికముగఁ జెఱుపుగలుగును. కావున గర్భిణు లెప్పుడును గృహకృత్యము లొన

రించుట మానరాదు. పనిలేక తిని కూర్చుండవలసిన భాగ్యవంతులు సుఖప్రసూతి కాఁజాలరు. ఇంటిపను లొనరించుకొను సామాన్యకుటుంబజనులు సుఖప్రసవ మగుట తఱుచుగ సంభవించుచుండును.

కృ:_లోకమున బహుజనులు గృహకృత్యాదులం బాటుపడువారలే కావున నిన్నివిషయములు వారెఱిఁగియుండకున్నను లోకవృత్తము పారంపర్యముగ నడచుచున్న దనుకొనెదను మీరనినట్లు విషయము లెఱిఁగియుండుట మేలే.

(కొంతకాలము జరిగెను. గణపతిశాస్త్రి యూహ ధ్రువపడెను. కృష్ణాబాయి కాఱుమాసములగర్భము జరిగెను. ఏడవమాసమునఁ బ్రసవార్థము పుట్టినింటివారు వెంటఁబెట్టుకొనిపోవుదుమని కబురంపిరి అప్పటినుండి కృష్ణాబాయి మనమ్మునఁ బ్రసవవేదనావిషయము లపుడపుడు లగ్నమగుచుండెను. కాని యది లోలోపలనే సర్దుబాటగుచుండెను. సంజీవయ్యగారు వచ్చిరి. ఈమెకుఁ గన్నవారింటి కేఁగఁగలనని సంతస మొకవంక యొప్పుచున్నను బ్రసవాందోళన మనమున నంతకంతకు బలపడుచుండెను. అది గణపతిశాస్త్రి కనిపెట్టెను.

గ:-లోకమున గర్భవతు లందఱును సుఖప్రసూతియగునటులనే పరమేశ్వరుఁడు నిర్ణయమేర్పఱిచెను. కాని కారణాంతరములచే నటనట నవాంతరములు సంభవించుచుండును. సుఖప్రసూతినిగుఱించి తలంచువా రరుదు. ఎచ్చటనేని విపరీతము కలిగిన నద్దానింగూర్చి లోకులు పరిపరివిధములుగ వాకొనుచుండెదరు. అందుచే నావిషయము పెక్కండ్రకుఁ గర్ణతాడిత మగుచుండును. కాని యిట్టివిపరీతములు నూటికిఁ బదియైన నుండవని చక్కఁగ విచారించినవారికిఁ దెలియఁగలదు. అదియును గాక మనవలెఁ జక్కని వాయుప్రచారముకల పల్లెటూళ్ళ నివసించి యథోచిత గృహకృత్యముల నొనరించుకొనువారి కిట్టి యవాంతరములు సామాన్యముగఁ గలుగవు. ఈయూరికంటెఁ గమలాపురియు నారోగ్యమున మంచిదని యెన్నికవడసియున్నది. ఆయూర రంగసానియను మంత్రసాని యున్నది. అది కడు నేర్పరియు విద్యావతియు నవీనమార్గములఁ బెక్కింటి నెఱిఁగి పలుతెఱఁగుల నారితేరిన ప్రౌఢయు. తనతోఁ బనిగలవారియెడఁ గడు దయతో మెలఁగి పనుల నొనరించు నేర్పరి. నాయం దామెకు గౌరవము కలదు. నిన్నటఁ గలసికొని సహకారిణిగా నుండ నే నామెకు లేఖ వ్రాసెదను. దైవకృప చక్కఁగ నుండిన మన మతిశీఘ్రమున నొకచో సుఖముగ నుండఁగలము.

(తరువాత వారముదినములకుఁ బగలు రెండుజాములవేళఁ గమలాపురములో సంజీవయ్యగారి యింటి గుమ్మముకడ "కృష్ణాబాయిగారూ" అని పిలుపు వినఁబడెను. అప్పట్టున నట గ్రంథావలోకన మొనరించుచుండిన కృష్ణాబాయియే లేచివచ్చెను. వాఁకిట నిలిచియున్న యువతి నా పేరు రంగసానియని యనినంతనే కృష్ణాబాయి లోపలి కాహ్వానించి సుఖాసీనం గావించి తాను నట నుపవేశించెను.)

రం:-మిమ్ముఁ జూచినంతనే మీరే మా గణపతిశాస్త్రిగారి యర్ధాంగి

(అనునప్పటికిఁ దదంగీకారసూచకంబుగఁ గృష్ణాబాయి తలయూఁచెను.)

రం:-గణపతిశాస్త్రిగారియెడ నాకు గురుభావము. వారికడ నేను గొంత విద్య నభ్యసించియుంటిని. నిన్నటిదినము వారిలేఖ యందినందున మీపరిచయము కోరి యిప్పు డిచ్చటికి వచ్చితిని.

కృ:-ని న్నిచటఁ గలసికొనుట నాకు బరమసంతోషముగ నున్నది. నీ నామమును సామర్థ్యమును నిదివఱకే శ్రుతములయి యుండి పరిచయముచేసి కొనఁగోరు నాకు సంతోషమును గలిగించుట వింతకాదు.

రం:-నే నీయూరనుండుదానంగాన మనము తఱుచుగఁ గలసి మాటలాడుచుండు నవకాశము కలుగుచుండఁ గలదు. నాయావాసము నిచ్చటికి సమీపమే. నేనే తఱుచు వచ్చుచుండఁగలను. ముఖ్యముగ మీ రెఱిఁగియుండవలసిన విషయములు కొన్ని చెప్పి మీసెలవు గైకొనియెద. సావధానముగ విని జ్ఞాపకముంచుకొని వాని నాచరింపఁగోరుచున్నాను. గర్భిణులు బిగువుగ వస్త్రముకట్టుటగాని రవికతొడుగుటకాని కూడదు. గర్భిణులకు మలబంధ మేర్పడుట సహజము. దినదినము సూర్యోదయమునకుఁ బూర్వమే యరసేరు చల్లని నీరు ద్రావుటచేఁ బలురోగములు నివారణమై గర్భిణికిని గర్భస్థశిశువునకును గడు నారోగ్యప్రదముగ నుండును. అటుల నీరుద్రావి పరుండరాదు. గృహకృత్యము లాచరించుచుండవలెను. ద్రాక్షపండ్లు నిమ్మకాయరసము తేనె కమలాఫలము మొదలగు నేపదార్థములైన సూర్యోదయకాలమున మితముగ భుజించుచుండిన మలబంధము తొలఁగవచ్చును. ఇట్టి యుపచారములచే మలబంధము నివారణ కానిచో నప్పుడప్పుడొక డబ్బెత్తు చిట్టాముదము త్రాగుచుండవచ్చును. నెలలు నిండినవెనుక మలబంధము లేకుండఁ గనిపెట్టుట ప్రాముఖ్యము

(కృష్ణాబాయికిఁ గనుప్రొద్దులు సమీపించుటయు నొకరోజున దుర్గాబాయితో)

ప్రసవచిహ్నములు మొదలు గర్భిణికిఁ దఱచు మూత్రము వెళ్లుటగ నేర్పడును. శిశువు క్రిందికి దిగినవెనుకఁ బ్రసవవేదన లేర్పడకమున్ను తేలికగ నుండును. అట్టిసమయమున నేను రాఁగలను. కనిపెట్టి మీరు నాకుఁ గబురుచేయుఁడు. మీరు చూపిన పురిటిల్లు మంచి గాలియు వెలుఁగును రాఁగలిగి విశాలముగ నున్నది; కనుక నందుకు నేఁ జేయఁగల యాక్షేపణగాని చూపఁగల యభివృద్ధిగాని లేదు. కాని యొక మనవి. ప్రసవసమయమునకుఁ బలువు రమ్మలక్కలఁ జేరనీయకుఁడు. అట్లుచేరిన నచట గాలి మలినమై శిశువునారోగ్యమును భంగపఱచును. బాలింతరాలికిని బీడఱకలుగును. అంతియ కాక యచటఁ బ్రస్తావించఁగూడని కష్టప్రసవవార్తలును విచారకరమగు వార్తలును బైలుదేఱును. కాన

బాలింతరాలికి సహాయమొనరింప సంసిద్ధురాలగు నొక బిడ్డలఁగన్నతల్లి యట నుండవలెను. ఆమె దయగలదిగ ధైర్యశాలినిగ నుండవలెను. అందుకు ముఖ్యముగా నామె తల్లిగారగు మీరు తగియుందురు.

దు:- నీవుచెప్పినవిషయము నా కానందదాయకముగ నున్నది. మాబోంట్లెఱుఁగి యుండఁదగిన సంగతు లపుడపు డవకాశముకలిగినపుడెల్ల నీవు తెల్పుచుండఁ గలవని నా కోరిక.

రం:- మీరిటు లడిగినందులకు నాకుఁ బరమసంతోషము. కుటుంబిను లెల్లరు నెఱుఁగి యుండఁదగిన పలువిషయంబులు నొత్తి చెప్పినను నది తమ కెంత ముఖ్యమగు విషయమైనను లక్ష్యముంచరు. అది మనవారి లోపమని నాతలంపు. మీరుగ నన్నడిగితిరి కావున నా చేతనైనవఱ కవకాశముకలిగినపుడెల్ల మీ కనుభవమునకు రాఁదగిన విషయముఁ దెల్పుచుందును (అని వెడలిపోయెను.)

## —♦ ప్రసవము ♦—

(కృష్ణాబాయి ప్రసవించెను. అందుకొఱకచట వేచియున్న దుర్గాంబతో)

రం:- ప్రసవమైన వెంటనే బొడ్డునరము శిశువు మెడకుఁ జుట్టుకొనియుండినను నూపిరివిడుచుట కడ్డగించునట్లు ముఖమునందును ముక్కుపద్దను నే యితర పదార్థమైనఁ గప్పుగ నుండినను దోడనే తొలఁగించవలెను. శిశువు తోడనే యేడువనిచోఁ బిఱ్ఱలమీఁదఁ జిటికవేసి యేడిపించవలెను. అప్పటికిని నేడువనిచో శీతోదకము చల్లియు గుడ్డగాల్చినవాసన చూపియు నేడ్చునట్టు లొనరించవలెను. కాని మన శిశువు దైవకృపవలన నీలోపములు కలుగలేదు. కాన బొడ్డుదారము కట్టవచ్చును. ఏడ్చుటకు ముందుగ బొడ్డుదారము కట్టిన శిశువు జీవించదు. నీళ్లు తెప్పింపుఁడు. శిశువునకు మన మోచేయి భరింపఁగలిగినంత మాత్రమే వేఁడినీరు పోయవలెను. అఱచేయి మోటువాఱియుండుటచే వేఁడిని గ్రహింపఁజాలదు. (అని చెప్పి బొడ్డుకోసి బిడ్డకు నీళ్ళుపోసి పరుండఁబెట్టి) ఆమె నిదివఱకే పరుండఁబెట్టితిమి. బ్రాందియిచ్చుట మంచిదికాదు. కొంచెము కస్తూరి యింగువ నిచ్చెదను. లంకణము లుంచవలదు. దానఁ బలురోగము లంకురించును. నీరులేకుండ నిప్పులమీఁదఁ గాల్చిన గోధుమరొట్టె లొకటిరెండిచ్చుట శ్రేయస్కరి. మూడవదినము పథ్యముపెట్టినవెనుక నీరొట్టెల నిచ్చుటనవసరము. సూతికాగృహమున నుక్కలేకుండఁ జల్లఁగ నుండునట్టు లొనరించవలెను. అందుఁ గుంపట్లు నూఁదరలుఁ బెట్టిన బాలింతరాలియొక్కయు శిశువుయొక్కయు నారోగ్యమునకు భంగకరములు. పురిటిగది యోరవాఁకిలి కలదిగ నుండవలెను. ప్రసవానంతరపుఁ దల్లిపిల్లలకు మిగులవిశ్రాంతి యవసరము. కనుక దానికి భంగము కలుగనీయరాదు. బిడ్డ తనంతటఁ దా నిద్రలేచినవెనుక నే పాలీయవలెను.

# సహాయులు

౧ మెదక్ శివరామ రావు దేశముఖుగారు, నల్లపల్లి
౨ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౩ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణము, దుగ్గిరాల
౪ తిరుమల నల్లాన్ చక్రవర్తి వరదాచార్యులు అయ్యవార్లంగారు - కాకాతురము.
౫ రాయచూరి బండేరావుగారు, అయినాపురము.
౬ రాజా మంత్రిప్రెగడ రాఘవరావుగారు - లింగగిరి
౭ చిక్కారాజా మట్టపల్లిరావుగారు - చెలకుర్తి. [ఏజంటు
౮ సాదరగుల్ సంగమేశ్వరరావు దే॥గారు శ్రీశ్రీ జగద్గురు శృంగేరి సంస్థానపు
౯ రామరాజభూషణ భాషానిలయము - పెంట్లవెల్లి.
౧౦ అద్దంకి ... తిరువేంగడతాతదేశికాచార్యులయ్యవార్లంగారు, శ్రీకాళహస్తి.
౧౧ మిర్యాలపురం రామకృష్ణారావుగారు, కొల్లాపురం.
౧౨ మల్లాది నరసింహమూర్తిగారు, ప్లీడరు, గురజాల.
౧౩ కొత్వాలి కమలాకరరావు దేశముఖుగారు, నల్లపల్లి.
౧౪ కురికాల వెంకటేశ్వరరావుదేశముఖుగారు, పులిగళ్ళ
౧౫ రాజా మంత్రిప్రగడ వెంకటహనుమంతరావుగారు, లింగగిరి.
౧౬ జింకా వెంకటసుబ్బారావుగారు, వకీలు, గురజాల.
౧౭ వద్దిరాజు సత్యనారాయణరావు దేశపాండ్యాగారు, మోదిపల్లి.
౧౮ గొట్టిపర్తి సుబ్బారావుగారు, వకీలు, సింగరేణి కొలరీసు.
౧౯ మాకేపల్లి వెంకటశివరామారావు, మాధవరావు దేశముఖుగార్లు, కొక్కిరపల్లి.
౨౦ దంటు లక్ష్మీనరసింహముగారు - కుద్దపల్లి.
౨౧ మద్దూరు సాంబయ్యగారు - పొగాకుకంపెని - పరుచూరు.
౨౨ కేశవరావు దేశముఖుగారు - నెల్లుట్ల
౨౩ ముద్దు చంద్రయ్య, మాకేపల్లి మారుతిరావు దేశముఖుగార్లు-కొత్తపల్లి. [బాదు
౨౪ రాయప్రోలు సుబ్బారావుగారు, ప్రొఫెసర్, యూనివర్సిటీకాలేజి, హైదరా

# అభినవసరస్వతి

అనువాదకుఁడు – నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములు నుపన్యాసములును బ్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 8—0—0

## ఈ కార్యస్థానమున వెలకు దొరకు పుస్తకములు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | విరూపాక్షపీఠగురుపరంపర | ... | 0 | 2 | 0 |
| 2 | నీతిగీతులు (సుమతిశతకము, దానికి శ్లోకములు) | ... | 0 | 2 | 0 |
| 3 | వాసంతికాపరిణయ నాటకము | ... | 0 | 4 | 0 |
| 4 | కలికోద్ధారిణి [ప్రాచీనప్రబంధము] | ... | 0 | 4 | 0 |
| 5 | విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము | | 0 | 2 | 0 |
| 6 | వత్సలనీతిశతకము | ... | 0 | 1 | 0 |
| 7 | పర్వారావుపేట శతావధానము (తిరుపతివేంకటీయము) | | 0 | 8 | 0 |
| 8 | సంగదోషము | ... | 0 | 8 | 0 |
| 9 | విశ్వశబ్దవిచారము | ... | 0 | 2 | 0 |
| 10 | పురశ్చరణము | ... | 0 | 2 | 0 |
| 11 | విగ్రహారాధన ఖండనఖండనము | ... | 0 | 4 | 0 |
| 12 | స్వర్ణకారవ్యవహారము | .. | 1 | 8 | 0 |
| 13 | ఉద్ధాంధ్రమహాక్షేంద్ర చరిత్రము | ... | 0 | 10 | 0 |
| 14 | సూతసంహిత (ఆంధ్రము) | ... | 2 | 0 | 0 |
| 15 | భారతీయప్రబోధము (పిడుపాటి చిదంబరశాస్త్రి) | | 0 | 4 | 0 |
| 16 | ధర్మనిర్ణయము. | | 0 | 4 | 0 |
| 17 | అస్పృశ్యతానివారణఖండనము (మల్లాది రామకృష్ణచయనులు గారు) | | 0 | 8 | 0 |
| 18 | స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము ( ౧ సంపుటము ) | | 1 | 0 | 0 |
| 19 | డిటో నాగరఖండము (౨ సంపుటము) | | 1 | 8 | 0 |
| 20 | డిటో నాగరఖండము (3 సంపుటము) | | 1 | 8 | 0 |
| 21 | డిటో నాగరఖండము (౪ సంపుటము) | | 1 | 8 | 0 |
| 22 | పల్నాటివీరచరిత్ర | | 0 | 12 | 0 |
| 23 | ఆరోగ్యభాస్కరము | | 0 | 6 | 0 |
| 24 | భాగవతరహస్యములు | | 0 | 4 | 0 |
| 25 | సోమేశ్వరశతకము | | 0 | 2 | 0 |

అభినవసరస్వతి కార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,

గుంటూరు జిల్లా.